క్లుప్తంగా

ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన యువతులు



ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న యువతులు

నేరడిగొండ: రాఖీ పండుగ ముగిసినప్పటికీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై ప్రేమతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన యువతులు రాఖీలు కట్టారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి రాఖీలు కట్టారు.

పోలీసులకు..

ఆదిలాబాద్‌టౌన్: మిషన్ శక్తి, డీహెచ్‌ఈడబ్ల్యూ బృందం శిశుగృహ చిన్నారులు, పాఠశాల విద్యార్థినులతో కలిసి పోలీసు అధికారులకు రాఖీ కట్టారు. శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ యశోద, కృష్ణవేణి, కోటేశ్వర్‌రావు, నిఖిలేశ్వర్, వెంకటేశ్, శిశుగృహ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందజేత

సాత్నాల: భోరజ్ మండలం మాండగాడ ప్రాథమిక పాఠశాలలో నేలపై దుమ్ముతో, గుంతలు గదుల్లో కూర్చొని చదువుకున్న పరిస్థితిని చూసి పూర్వ విద్యార్థి మామిడి మల్లారెడ్డి రూ. 20వేల రూపాయలతో ఫ్లోరింగ్ చేయించారు. మరో పూర్వ విద్యార్థి ముక్కెర ప్రభాకర్ ఫ్యాన్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు అర్చన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాపెట్ మహేందర్ రావు, బండారి వినోద్, నర్రా విట్టల్ ఆశన్న, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

సిరికొండ: మండలంలోని రాంపూర్ (బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఎన్నారై దంపతులు ఆనంతుల శ్రావణ్, స్నేహలు 37 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి



గోకులాష్టమి వేడుకలో పాల్గొన్న మహిళలు

బజార్‌హత్నూర్: మండలంలోని ఏసాపూర్, చందునాయక్‌తండా, మంజరంతండా, గోకొండ, బుర్కాపల్లి గ్రామాల్లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మధురా సమాజ్ మహిళలు ఘనంగా నిర్వహించారు. పవిత్రమైన పుట్ట మన్నుతో చిన్ని కృష్ణుడి విగ్రహం తయారుచేసి పూజలు చేశారు. మహిళలు, పిల్లలు దాండియా నృత్యం చేశారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీరాంనాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, కోశాధికారిగా భీమన్న, లింగన్న, ఉపాధ్యక్షులుగా గంగాధర్, జితెందర్, నాని, శ్రీకాంత్, తిరుపతి, రవి, సహా కార్యదర్శులుగా సాయి, అన్వేష్, కైలాస్, మారుతి, అనుదీప్, రాజశేఖర్, పవన్ కల్యాణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎంపీ పరామర్శ

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శుక్రవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన విలాస్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాంత్ రెడ్డి, జామిడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ కేశవ్ రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, సదానంద్, సంతోశ్ రెడ్డి, నారాయణ, పరమేశ్వర్, దాస్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎగురవేయని జాతీయ జెండా



టీచర్ కోసం ఎదురు చూస్తున్న చిన్నారులు

ఇచ్చోడ: మండలంలోని సాథ్‌నబంర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం జాతీయ జెండా ఎగురవేయలేదు. అంగన్‌వాడీ సెంటర్‌కు ముస్తాబైన వచ్చిన పిల్లలు వేచి చూసి జాతీయ జెండా ఎగురవేయక పోవడంతో నిరశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇక్కడి అంగన్‌వాడీవర్కర్ గత రెండేళ్ల క్రితం మృతి చెందగా.. పక్క అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జెండా ఎగుర వేసేందుకు రాలేదు.



బేలలో..



తాంసి: జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ లక్ష్మి



సిరికొండ: జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు



బోథ్: మహనీయుల వేషధారణలో చిన్నారులు

మురిసిన మువ్వన్నెల జెండా

జిల్లా వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చిత్రపటాలకు పూల మాలవేసి నివాళులర్పించారు. ఊరూరా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, భారత్‌మాత్‌కు జై అంటూ నినాదాలు చేశారు. ఆయా నియోజకవర్గంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జాతీయ జెండా ఎగురవేశారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు, క్రీడ పోటీలు అలరించాయి. చిన్నారుల మహనీయుల వేషధారణ ఆకట్టుకుంది.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌టౌన్: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నేరడిగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు



ఉట్నూర్‌రూరల్: జెండా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఇంద్రవెల్లి: పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న తహసీల్దార్



సాత్నాల: సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, అధికారులు



తలమడుగు: ఎంపీడీవో కార్యాలయంలో..



నార్నూర్: తహసీల్దార్ కార్యాలయంలో..



జైనథ్: జెండా ఎగరవేస్తున్న తహసీల్దార్



బజార్‌హత్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్యాంసుందర్



భీంపూర్: జెండాకు సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ నలందప్రియ



నేరడిగొండ: జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ కలీమ్

గ్రామస్తులు ఆందోళన చెందొద్దు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో క్షుద్రపూజల పేరిట గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన వస్తువులను చూసి గ్రామస్తులు శుక్రవారం భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు మూఢ విశ్వాసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆధునిక యుగంలో ప్రజలు చైతన్యవంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జాదవ్ కీరు, కానిస్టేబుల్ ఆశిష్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద లస్మన్న

సిరికొండ: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని బోయవాడ కాలనీకి చెందిన సంటి లస్మన్నకు చెందిన ఇల్లు గురువారం రాత్రి కూలింది. లస్మన్న అతని భార్య నిద్రిస్తుండగా ఒక్కసారిగా కూలింది. ఈ ఘటనలో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. లస్మన్న ఇంటిని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

నాసిరకంగా రోడ్డు పనులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జైనథ్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా నుంచి నిర్మిస్తున్న జాతీయ రహదారిని నాసిరకంగా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంవత్సరం నుంచి పనులు చేస్తున్నా.. ఇప్పటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తికాక ముందే రోడ్డుపై పగుళ్లు తేలాయి. వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మిస్తున్న రోడ్డు నాలుగు రోజులకే అధ్వానంగా మారిందని వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయన్నారు.

పశువైద్యంపై పట్టింపుఏది?

- శిథిలావస్థలో పొన్నారి పశువైద్యాశాల
- ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పొన్నారి పశువైద్యశాల భవనం

తాంసి: రైతులకు ప్రధానంగా వ్యవసాయంతో పాటు పాడిపశువుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తారు. పశువుల పెంపకంతో ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రైతుల ఆర్థికాభివృద్ధి చెందుతారు. కానీ రైతులు పెంపకం చేసే పశువులకు వ్యాధులు సోకితే చికిత్స అందించే పశువైద్యశాలలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో వైద్యం అందడం లేదు. పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరగా.. కొన్ని చోట్ల సిబ్బంది లేక పశువులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. మండలంలోని పొన్నారి పశువైద్యాశాల శిథిలావస్థకు చేరింది. వర్షానికి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షానికి ఉరుస్తూ.. మందులు తడిసిపోతున్నాయి. భవనం స్థానంలో మరోక భవనం నిర్మించాల్సి ఉన్నా.. మరమ్మతులతో సరిపెడుతున్నారు.

పాడి పశువుల పెంపకం..

రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకంపై దృష్టిసారిస్తున్నారు. గెదేలు, ఆవులు, మేకలు, గొర్రెల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తారు. పొన్నారి పశువైద్యశాల పరిధిలోకి తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాలతో పాటు రూరల్ మండలంలోని రాంపూర్, జందాపూర్, లాండసాంగ్వి, సావర్గాం, భీంసరి, పొచ్చెర గ్రామాలు వస్తాయి. ఆయా గ్రామాల రైతులు పశువులకు వ్యాధులు సోకితే పొన్నారి పశువైద్యశాలకు తీసుకు వచ్చి చికిత్స అందిస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన పశువైద్యాశాల భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలి. పశువులకు మెరుగైన వైద్యం అందాలంటే ముఖ్యంగా వసతులు కల్పించాలి. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– లక్ష్మిపతి, రైతు, పొన్నారి

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో సిరికొండ మండలంలోని నేరడిగొండ(జి), నారాయణపూర్, జెండగూడ, రాజులగూడ, సిరికొండ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ ఇమామ్, బద్దం పోతారెడ్డి, మాధవ్ పటేల్, కంచం జగన్, కృష్ణ, కిషన్ పటేల్, ఉయిక దేవరావు, జగ్జీవన్ రావు, ఎండీ సద్దాం, మౌలానా, తీగల విలాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్‌ఈవో పవార్ రవీందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొర్టికల్(కె) గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 45 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుప్రతికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆత్రం నగేశ్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, నర్సయ్య, నరేందర్ రెడ్డి, ఆశ వర్కర్ పెందూర్ గంగామణి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నూర్‌సింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్‌లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని పేర్కొన్నారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సమ్మె కాలపు వేతనం చెల్లించాలన్నారు. గిరిజన శాఖలో పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కనక అభిమాన్, బాబన్న, ముజీబ్, సునీల్‌కుమార్, సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



విజేతలతో క్లబ్ సభ్యులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన సభ్యులకు శుక్రవారం బహుమతులు అందించారు. పలు ప్రధాన క్రీడాంశాల్లో విజేతగా నిలిచిన క్లబ్ స్పోర్ట్స్ సెక్రటరీ ధనుంజయ్‌కి ఓవరాల్ ఛాంపియన్ షిప్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ చౌహన్ జైవంత్, అనిత, డి. ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని మథురతండా గ్రామానికి చెందిన బర్ధవాల్ చిమినిబాయికి రూ.42 వేలు, బోథ్‌కు చెందిన సురేందర్ యాదవ్‌కు రూ.17వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

క్రీడాస్థలం కోసం భూమి విరాళం



భూదాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

భీంపూర్: మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాల క్రీడాస్థలం కోసం గ్రామానికి చెందిన పన్నాల భూమారెడ్డి, సంజీవరెడ్డి దాదాపు రూ. 60 లక్షల విలువగల 1.5 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు గ్రామపెద్దలు ఆయనను శాలువతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావడం గొప్ప విషయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

మండల పరిషత్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వెద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బోథ్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామేశ్వర్, నితేష్, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.